గ్రీనరీ గాయబ్..!

పారిశ్రామిక ప్రాంతాల్లో పచ్చదనం కనుమరుగు



గాంధీనగర్ విరూపాక్ష కెమికల్స్ పరిశ్రమను ఆనుకుని ఉన్న షెడ్డు

పచ్చదనంతో కళకళలాడాల్సిన పారిశ్రామికవాడల్లో క్రమంగా పచ్చదనం కనుమరుగవుతోంది. గత బీఆర్ఎస్ హయాంలో హరితహారంలో భాగంగా ఐలా అధికారులు వేలాదిగా నాటిన మొక్కలపై పర్యవేక్షణ లేక ప్రస్తుతం వాటి జాడ మచ్చుకైనా కనిపించడం లేదు. దీంతో పారిశ్రామిక వాడకు ఆనుకుని ఉన్న బస్తీవాసులు స్వచ్ఛమైన గాలికి దూరమవుతున్నారు. వివరాల్లోకి వెళ్తే.. రంగారెడ్డినగర్ డివిజన్ పరిధిలోని గాంధీనగర్, రంగారెడ్డినగర్, గురుమూర్తినగర్, గిరినగర్, వెంకట్రామిరెడ్డినగర్, సంజయ్‌గాంధీనగర్, నెహ్రూనగర్, పంచశీలకాలనీ, చెన్నారెడ్డినగర్‌ను ఆనుకుని సీఐఈ గాంధీనగర్, ఐడీఏ గాంధీనగర్ పారిశ్రామికవాడ ప్రాంతాలు విస్తరించి ఉన్నాయి. కెమికల్ పరిశ్రమలతో పాటు ఇంజినీరింగ్, ప్యాకింగ్, ఫుడ్ ప్రాసెసింగ్, ఎలక్ట్రానిక్, ఎలక్ట్రికల్ పరిశ్రమలతో పాటు ఇతర చిన్నతరహా పరిశ్రమలు నెలకొల్పారు. అయితే ఏ ఒక్క పరిశ్రమ ఎదుట మచ్చుకైనా పచ్చదనం కనిపించదు. ఉన్న గ్రీనరీని సైతం కొందరు పరిశ్రమల యాజమాన్యాలు తొలగించి తమ సొంత అవసరాలకు వినియోగించుకుంటున్నాయి. పారిశ్రామిక ప్రాంతంలో 25 శాతం గ్రీనరీ ఉండాలనే ప్రభుత్వ నిబంధనలు అధికారుల నిర్లక్ష్యంతో అమలుకు నోచుకోవడం లేదు. –రంగారెడ్డినగర్



రంగారెడ్డినగర్ ప్రధాన రోడ్డులో ఇటుకలు, డస్ట్ డంపింగ్

- గ్రీనరీ ప్రాంతాల్లో అక్రమంగా నిర్మించిన పార్కింగ్ షెడ్లు, గదులు
- టీస్టాళ్లు, భవన నిర్మాణ సామగ్రి డంప్
- స్వచ్ఛమైన గాలికి దూరమవుతున్న బస్తీవాసులు

గ్రీనరీ ప్రాంతంలో ఇటుక, ఇసుక వ్యాపారం

రంగారెడ్డినగర్ బస్టాప్ సమీపంలోని గాంధీనగర్ పారిశ్రామికవాడ గ్రీనరీ ప్రాంతంలో కొందరు చెట్లను తొలగించి యథేచ్ఛగా ఇటుక, డస్ట్, ఇటుక వ్యాపారం నిర్వహిస్తున్నారు. ఇదంతా ప్రధాన రహదారిలోనే జరుగుతున్నా గాంధీనగర్ ఐలా అధికారులకు కనిపించకపోవడం గమనార్హం. ఎవరైనా ఈ విషయమై అధికారులకు ఫిర్యాదు చేసినా కొందరు ప్రజాప్రతినిధుల అండదండలు ఉండటంతో ఐలా అధికారులు చూసీ చూడనట్లు వదిలేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి.



చెన్నారెడ్డినగర్‌లో పరిశ్రమ ఎదుట ఏర్పాటు చేసిన పార్కింగ్ షెడ్డు

పరిశ్రమల ముందే పార్కింగ్ షెడ్లు

గాంధీనగర్ సీఐఈ, ఐడీఏ పరిధిలోని పరిశ్రమల ఎదుట ఐలా అధికారులు గ్రీనరీకి కొంత ప్రాంతాన్ని వదిలారు. ఇందులో విధిగా సదరు పరిశ్రమల యాజమాన్యాలు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని నిబంధనలు ఉన్నాయి. అయితే ఏ ఒక్క పరిశ్రమ నిబంధనలు పాటించడం లేదు. పరిశ్రమ ఆవరణలోనే వాహనాల పార్కింగ్‌ను ఏర్పాటు చేసుకోవాల్సి ఉండగా కొందరు గ్రీనరీని తొలగించి షెడ్లు, సెక్యూరిటీ, వాచ్‌మెన్‌ల గదులు నిర్మించారు. దీంతో పలు పరిశ్రమల ముందు పచ్చదనం ఆనవాళ్లే కరుమరుగయ్యాయి.

గ్రీనరీలో డబ్బాలు, టిఫిన్ సెంటర్లు

గాంధీనగర్ పారిశ్రామిక ప్రాంతంలోని వివిధ పరిశ్రమలకు నిత్యం లోడింగ్, అన్‌లోడింగ్ కోసం భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. లారీల సిబ్బంది రోజుల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంటోంది. దీంతో ఈ ప్రాంతంలో తినుబండారాలు, టీస్టాళ్లకు గిరాకీ పెరిగింది. ఈ నేపథ్యంలో గ్రీనరీ ప్రాంతంలో టీస్టాళ్లు, టిఫిన్ సెంటర్లు వెలిశాయి. సమీపంలోని పరిశ్రమల యాజమాన్యాలే టీస్టాళ్లు, డబ్బాల నిర్వాహకుల నుంచి నెలవారీ అద్దెలు వసూలు చేస్తున్నారన్నది బహిరంగ రహస్యం. ఐలా అధికారులకు ఈ విషయం తెలిసినా పరిశ్రమల యాజమాన్యాలతో వారికున్న సన్నిహిత సంబంధాల నేపథ్యంలో చర్యలు తీసుకోవడానికి వెనుకడుగు వేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

నాటిన మొక్కలు మాయం

సీఐఈ గాంధీనగర్, ఐడీఏ గాంధీనగర్ ప్రాంతాల్లో జీహెచ్ఎంసీ, ఐలా ఆధ్వర్యంలో గతంలో హరితహారం కార్యక్రమంలో భాగంగా వేలాది మొక్కలను పారిశ్రామిక వాడ రోడ్లకిరువైపులా నాటారు. అయితే పలు పరిశ్రమల యాజమాన్యాలు భవనాల విస్తరణలో భాగంగా చెట్లను తొలగించాయి. మరికొన్ని పరిశ్రమల ఎదుట నాటిన మొక్కలకు నీళ్లు పోయకపోవడంతో ఎండిపోయి ప్రస్తుతం మొక్కలు కానరావడం లేదు. మరోవైపు కొన్నేళ్లుగా పారిశ్రామికవాడ ప్రాంతంలో హరితహారం కార్యక్రమం నిర్వహించిన దాఖలాలు లేవు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పారిశ్రామిక ప్రాంతంలో గ్రీనరీని పెంచాలని స్థానికులు కోరుతున్నారు.



హరితహారంలో నాటిన మొక్కల ప్రాంతంలో పార్కింగ్ షెడ్డు



పరిశ్రమల ముందు నాటిన మొక్కలు మాయమైన దృశ్యం

క్లుప్తంగా

సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేసిన కొలన్ హన్మంత్‌రెడ్డి

నిజాంపేట్ : మున్సిపల్ కార్పొరేషన్ పరిధి సింహపురి కాలనీలో సీసీ రోడ్డు పనులకు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ చిట్ల దివాకర్, ఎస్ఎంసీ అధ్యక్షుడు కొలన్ రాజశేఖర్‌రెడ్డి, జనరల్ సెక్రటరీ కొలన్ జీవన్ రెడ్డి, బుచ్చిరెడ్డి, సత్తిరెడ్డి, నర్సింహారెడ్డి, అశోక్ రెడ్డి, సంజీవరెడ్డి, రామ్‌కుమార్, సత్యనారాయణరెడ్డి, దేవేందర్, దుర్గారావు, శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్‌తో భరోసా



చెక్కులు అందజేస్తున్న శంభీపూర్ కృష్ణ

దుండిగల్: నిరుపేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో ఉపయోగకరంగా మారిందని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నేత శంభీపూర్ కృష్ణ అన్నారు. అనారోగ్యానికి గురైన పలువురు తమను ఆదుకోవాలని ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును ఆశ్రయించారు. వెంటనే స్పందించిన ఆయన సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రూ.3 లక్షలు మంజూరు చేయించారు. సదరు చెక్కులను శంభీపూర్‌లోని పార్టీ కార్యాలయంలో శంభీపూర్ కృష్ణ లబ్ధిదారులకు సోమవారం అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గద్దె నరసింహ, మాజీ ఎంపీటీసీ ఆకుల భార్గవ్, పీఏసీఎస్ డైరెక్టర్ అర్కల జీతయ్య, మాజీ వార్డు సభ్యులు ఉప్పరి బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణికి 6 ఫిర్యాదులు



సుభాష్‌నగర్ రోడ్డు విషయమై ఉప కమిషనర్ నర్సింహకు ఫిర్యాదు చేస్తున్న స్థానికులు

కుత్బుల్లాపూర్: జంట సర్కిళ్లలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో 6 ఫిర్యాదులు వచ్చాయి. గాజులరామారం ఉప కమిషనర్ మల్లారెడ్డి అధ్యక్షతన ఇంజినీరింగ్ విభాగంపై ఒక ఫిర్యాదు రాగా సంబంధిత శాఖ అధికారులకు వాటిని పంపి పరిష్కరించాలని ఆదేశించారు. అదేవిధంగా కుత్బుల్లాపూర్ సర్కిల్ ఉప కమిషనర్ నరసింహ అధ్యక్షతన ప్రజావాణికి 5 ఫిర్యాదులు వచ్చాయి. ఇందులో ఇంజినీరింగ్ 2, ఎలక్ట్రికల్ 1, శానిటేషన్ 1, టౌన్ ప్లానింగ్ 1 వచ్చాయి. సుభాష్‌నగర్ డివిజన్ పరిధిలో ఇంజినీరింగ్ అధికారులు చొరవ తీసుకొని రోడ్డు వేయాలని కోరగా సానుకూలంగా స్పందించి డి పాపమ్మను సైట్ విజిట్ చేసి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. అదేవిధంగా రుక్మిణి ఎస్టేట్, సుభాష్ నగర్ పైప్‌లైన్ రోడ్డు స్టీల్ బ్రిడ్జి నిర్మాణం విషయంపై పులి బలరాం అనే వ్యక్తి ఫిర్యాదు చేశారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత



దుండిగల్: అనుమతులకు మించి నిర్మిస్తున్న పలు అక్రమ నిర్మాణాలపై మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టారు. మున్సిపల్‌లో బహుళ అంతస్తుల నిర్మాణానికి అనుమతులు తీసుకుని అక్రమంగా అదనపు అంతస్తులు నిర్మిస్తున్నారని అధికారులకు ఫిర్యాదు అందాయి. వెంటనే విచారణ చేపట్టిన అధికారులు గాగిల్లాపూర్‌లోని డ్రీమ్ వన్ వెంచర్‌లో 4, మల్లంపేటలోని కేవీఆర్ లే అవుట్‌లో 2 నిర్మాణాలను టౌన్ ప్లానింగ్ అధికారి సంజున ఆధ్వర్యంలో సిబ్బంది కూల్చివేశారు.

29న ప్రతిభా పురస్కారాల ప్రదానం



సతీశ్‌సాగర్, మహేందర్‌సాగర్

కుత్బుల్లాపూర్: తెలంగాణ సగర సంఘం ఆధ్వర్యంలో ఏటా నిర్వహించే రాష్ట్రస్థాయి సగర విద్యార్థుల ప్రతిభా పురస్కారాల మహోత్సవాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ సగర సంఘం ఉపాధ్యక్షుడు పెద్దబద్దుల సతీశ్ సాగర్, రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి ఉప్పరి మహేందర్ సాగర్ సూచించారు. కొంపల్లిలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఈనెల 29న హైదరాబాద్‌లోని రవీంద్రభారతి ప్రాంగణంలో నిర్వహిస్తున్న కార్యక్రమానికి రాష్ట్రంలోని అన్ని జిల్లాల విద్యార్థులు హాజరు కావాలన్నారు. సగర విద్యార్థులను విద్యారంగంలో ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఏటా నిర్వహిస్తున్నామన్నారు. పదో తరగతి, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ, బిటెక్, ఎంటెక్, బీకాం, బీఎస్సీ, ఎంబీబీఎస్, ఎండీ, పీజీ, పీహెచ్‌డీ అనేక స్థాయిలో ఉత్తీర్ణులై మెరుగైన ప్రతిభ చూపిన విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఆయా కోర్సుల్లో వచ్చిన మార్కులు లేదా గ్రేడ్‌ను బట్టి ఎంపిక చేస్తామన్నారు. అలాగే సాంస్కృతిక, సాహిత్య, క్రీడా తదితర అంశాల్లో రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పాల్గొని ప్రతిభ చూపిన వారు కూడా పురస్కారాలకు అర్హులని తెలిపారు.

లోక కల్యాణార్థం 'ధర్మ విజయయాత్ర పూజ'



కుత్బుల్లాపూర్: లోక కల్యాణార్థం తలపెట్టిన ధర్మ విజయ యాత్ర పూజ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వేద పండితులు రాచర్ల హైందవ రవిచంద్ర శర్మ పిలుపునిచ్చారు. సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ఎన్.సి.ఎల్ నార్త్ కాలనీలో ఈనెల 17న శ్రీ భారతీ తీర్థ మహా స్వామి అనుగ్రహ ఆశీస్సులతో జగద్గురువులు శ్రీ విధుశేఖర భారతి స్వామి రానున్నారని తెలిపారు. దుర్గాదేవి సేవా సమితి సభ ప్రాంగణంలో కార్యక్రమం జరుగుతుందన్నారు. శుక్రవారం ఉదయం 6 గంటలకు చతుర్వేద సదస్సు, వేదస్వస్తి కార్యక్రమంతో ప్రారంభమై 8 గంటలకు స్వామి వారి పాదుకాపూజ దర్శనం ఉంటుందని తెలిపారు. భక్తులకు కోసం సుమారు 9 ఎకరాల్లో పార్కింగ్ స్థలాన్ని ఏర్పాటు చేశామన్నారు. ప్రతిఒక్కరూ పాల్గొని స్వామి వారి ఆశీస్సులు పొంది అన్నదాన కార్యక్రమంలో పాల్గొని తీర్థ ప్రసాదాలను స్వీకరించాలని కోరారు. సమావేశంలో కాలనీ వాసులు, పండితులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



సాయికుమార్

సుభాష్‌నగర్: రోడ్డు ప్రమాదంలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడిన ఘటన సూరారం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. సిద్దిపేట జిల్లా దుబ్బాకకు చెందిన సాయికుమార్, అజయ్ బావ బామ్మర్దులు. సాయికుమార్ గాజులరామారంలో నివాసం ఉంటూ ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం మైసమ్మగూడలో ఉంటున్న అజయ్ వద్దకు వెళ్లి సోమవారం తెల్లవారుజామున గాజులరామారం నుంచి వీరిద్దరూ కలిసి వస్తున్నారు. సాయిబాబానగర్ చౌరస్తా వద్దకు రాగానే ముందున్న కారును వేగంగా వచ్చి ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో సాయికుమార్ (32) అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన అజయ్‌ని స్థానిక మల్లారెడ్డి ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య, పాప ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం గాంధీ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రూప్‌కుమార్ ధనావత్‌కు డాక్టరేట్



దుండిగల్: దుండిగల్‌లోని మర్రి లక్ష్మణ్ రెడ్డి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న రూప్ కుమార్ ధనావత్ డాక్టరేట్ అందుకున్నారు. కర్ణాటకలోని మైసూర్ విశ్వవిద్యాలయం నుంచి 'గోలే కోడ్ ఉపయోగించి ఎర్రర్ డిటెక్షన్, కరెక్షన్ కోసం కమ్యూనికేషన్ సిస్టమ్‌లో ఎన్‌కోడర్, డీకోడర్‌కు అమలుకు సమర్థవంతమైన టెక్నిక్ అనే అంశంపై పీహెచ్‌డీ డిగ్రీని పొందారు. ఈ పరిశోధన తక్కువ విస్తీర్ణం, అధిక సామర్థ్యంతో కమ్యూనికేషన్ సిస్టమ్‌లలో ఎర్రర్ డిటెక్షన్, కరెక్షన్ యొక్క సమర్థవంతమైన రూపకల్పనకు దోహదపడుతుందని రూప్‌కుమార్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా పీహెచ్‌డీకి సహకరించిన కళాశాల సెక్రటరీ రాజశేఖర్ రెడ్డి, డైరెక్టర్ శ్రీధర్, ప్రిన్సిపాల్ ఆర్. మురళీప్రసాద్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

బాక్సింగ్‌లో భానుతేజ సత్తా

రాయదుర్గం: 69వ స్కూల్స్ గేమ్స్ ఫెడరేషన్ 2025–26 రాష్ట్రస్థాయి పోటీలో రాయదుర్గంలోని నాగార్జున స్కూల్ విద్యార్థి భానుతేజ బంగారు పతకాన్ని సాధించి జాతీయస్థాయి బాక్సింగ్ పోటీలకు అండర్–17 విభాగంలో ఎంపికయ్యాడు. రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ బాక్సింగ్ పోటీలను హనుమకొండలోని జేఎన్ఎస్ స్టేడియంలో నిర్వహించారు. సోమవారం రాయదుర్గంలోని పాఠశాలలో కరస్పాండెంట్ భరత్‌కుమార్, ప్రిన్సిపాల్ సుందరి భానుతేజను అభినందించారు.



కూన శ్రీశైలంగౌడ్ ఆధ్వర్యంలో ర్యాలీ తీస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

ప్రజాస్వామ్యంలో ఓటే వజ్రాయుధం

కుత్బుల్లాపూర్: ప్రజాస్వామ్య దేశంలో ఓటే వజ్రాయుధమని దానిని అంతం చేయడం ఎవరి తరం కాదని కాంగ్రెస్ నేత, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ అన్నారు. గాజులరామారంలోని సత్యగౌరి కన్వెన్షన్‌లో ఓటు చోరీపై సంతకాల సేకరణ చేపట్టారు. అనంతరం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కూన శ్రీశైలంగౌడ్ మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసేందుకు యత్నిస్తున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అడ్డుకుంటున్నారని, ఆయనకు మద్దతుగా ఉంటామన్నారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, రాహుల్ గాంధీ దృఢ సంకల్పంలో దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితాలో ఎలాంటి అవకతవకలు జరగకుండా దేశ నలుమూలల ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారన్నారు. అనంతరం ఆయనతో పాటు నాయకులు, కార్యకర్తలు సంతకాలు చేశారు. కార్యక్రమంలో నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



సంతకాలు సేకరిస్తున్న కూన శ్రీశైలంగౌడ్

ప్రమాదవశాత్తు వ్యక్తి మృతి



శ్రీధర్ (ఫైల్)

దుండిగల్: ప్రమాదవశాత్తు వ్యక్తి మృతి చెందిన ఘటన దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. ఐడీపీఎల్ గురుమూర్తినగర్‌కు చెందిన సిరిగిరి శ్రీధర్ (43) బహదూర్‌పల్లిలోని టెక్ మహీంద్రా సమీపంలో ఆదిత్య ప్లాస్టిక్ మౌల్డింగ్ పరిశ్రమను నిర్వహిస్తున్నాడు. కాగా పరిశ్రమలోని బ్లోయర్ మెషిన్ పాడవడంతో యంత్రానికి శ్రీధర్ మరమ్మతులు చేస్తున్నాడు. ఈ క్రమంలో యంత్రంపై ఉన్న స్టాండ్ అతనిపై పడడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జేఎన్‌టీయూలో ఇరాన్ కాన్సులేట్ అధికారులు



బాలానగర్: హైదరాబాద్‌లోని ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్ కాన్సులేట్ జనరల్ సభ్యులు జేఎన్‌టీయూ హైదరాబాద్ క్యాంపస్‌ను సోమవారం సందర్శించారు. ఇరాన్‌లోని ఇస్ఫహాన్ విశ్వ విద్యాలయానికి విద్యా సహకారం అవకాశాలను అన్వేషించేందుకు కాన్సులేట్ వైస్–కాన్సుల్ మొహ్సెన్ మొఘద్దామి, పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ ఫాతిమా నఖ్వీ జేఎన్‌టీయూహెచ్ వీసీ డాక్టర్ టి. కిషన్ కుమార్‌రెడ్డితో సమావేశమయ్యారు. ఇస్ఫహాన్ పబ్లిక్ విశ్వవిద్యాలయం 1946లో స్థాపించబడిన పురాతన ఇరానియన్ ఉన్నత విద్యా సంస్థల్లో ఒకటి. విద్యార్థులు, అధ్యాపకుల మార్పిడి, ఉమ్మడి పరిశోధన అవకాశాల గురించి చర్చించారు. జేఎన్‌టీయూహెచ్ రిజిస్ట్రార్ డాక్టర్ కె. వెంకటేశ్వరరావు, జేఎన్‌టీయూహెచ్ అకాడమిక్ అండ్ ప్లానింగ్ డైరెక్టర్ డాక్టర్ కె. వెంకటేశ్వరరావు, జేఎన్‌టీయూహెచ్ అకాడమిక్ అండ్ ప్లానింగ్ డైరెక్టర్ డాక్టర్ వి. కామాక్షి ప్రసాద్ పాల్గొన్నారు.